


**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.59,440 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,307 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.67,900 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.69.90 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 37 | 23 |
| చిత్తూరు | 36 | 23 |
| తిరుమల | 32 | 18 |
| గూడూరు | 33 | 26 |
| నగరి | 37 | 23 |



## ఆదర్శనీయం

వరదయ్యపాళెం: శ్రీసిటీ అభివృద్ధి ఆదర్శనీయమని తమిళనాడు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు అన్నారు. ఆయన శ్రీసిటీని సందర్శించగా ఎండీ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు.

## న్యూస్‌రీల్

### శాస్త్రోక్తంగా జలాధివాసం



జలాధివాసంలో అర్చకులు

**తిరుపతి అలిపిరి:** చెన్నైలోని జీఎన్‌చెట్టి వీధిలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా జలాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి పవిత్రజలంతో అభిషేకం చేశారు. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం చతుష్టానార్చన, మూర్తిహోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, నేతితో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం జలాధివాసం చేపట్టారు. చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యసేవలకు సహకరించండి



నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న కలెక్టర్

**తిరుపతి అర్బన్:** వైద్యవిభాగం నేతృత్వంలో మెరుగైన వైద్య సేవలందించడానికి విద్యాశాఖ, సీడీపీఓలు సహకరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. తిరుపతిలోని ఎంజీఎం పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని కార్యక్రమానికి హాజరైన ఆయన విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల వయసుగల పిల్లలందరికీ వంద శాతం ఆల్బెండోజోల్ 400 ఎంజీ మాత్రల పంపిణీ చేయాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణ సులోచన, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ హరినాథ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, విద్యాశాఖ కో–ఆర్డినేటర్ కిషోర్ పాల్గొన్నారు.

### సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న న్యాయవాదులు

**సూళ్లూరుపేట:** సూళ్లూరుపేట పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని జూనియర్ సివిల్ జడ్జికోర్టుకు చెందిన న్యాయవాదులు హైకోర్టు చీఫ్ జస్టిస్ రఘునందన్‌రావుకు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం వారు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. ముందుగా ఆయన్ను శాలువతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌మొదలి, ఉపాధ్యక్షులు మాలకొండయ్య, జనరల్ సెక్రటరీ మురళి, శ్రీరాములు యాదవ్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, ధర్మాప్రసాద్, రమేష్, పార్థసారథి, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, కుమరన్, నందకుమార్ పాల్గొన్నారు.

### నేడు రెండు చోట్ల రీపోలింగ్

**తిరుపతి అర్బన్:** నగరంలోని చిన్నబజారువీధి 229, సత్యనారాయణపురం 233 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం రీపోలింగ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. రీపోలింగ్‌కు సంబంధించి ఆయన అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 229 పోలింగ్ కేంద్రం పరిధిలో 579, 233 పోలింగ్‌కేంద్రం పరిధిలో 792 మంది ఓటర్లు ఉన్నారని, వీరంతా రీపోలింగ్‌లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఈ రెండు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని చెప్పారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కరనాయుడు, ఏఓ జయరాములు, ఎన్నికల తహసీల్దార్ పరమేశ్వరస్వామి, డీటీలు పవన్, విజయభాస్కర్, డీ.సెక్షన్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తర్వులను పాటించండి

**తిరుపతి లీగల్:** న్యాయవాద సంఘం కార్యవర్గ పదవులకు ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర బార్ కౌన్సిల్ జారీ చేసిన ఎన్నికల షెడ్యూల్‌ను తిరుపతి న్యాయవాదుల సంఘ కార్యవర్గ సభ్యులు పాటించాలని సీనియర్ న్యాయవాది అప్పిలి విజయకుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా ఎన్నికలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ షెడ్యూల్‌ను అమలు చేయాలని కోరారు.



కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణ్

# భద్రతలో బ్యాలెట్

- పకడ్బందీగా బ్యాలెట్ బాక్సుల స్క్రూట్నీ
- పక్కాగా స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్

**సాక్షి, తిరుపతి/ చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం చిత్తూరులోని ఎస్వీ సెట్(ఆర్‌వీఎస్) కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను పకడ్బందీ బందోబస్తు నడుమ తరలించారు. స్క్రూటినీ అనంతరం పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం ఓట్లు (తిరుపతి జిల్లాలో రద్దయిన 229,233 పోలింగ్ కేంద్రాల ఓట్లు మినహాయించి) పోలైనట్లు రిటర్నింగ్‌అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్ సమక్షంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీల్ వేసినట్లు తెలిపారు. జేసీ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీ, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓలు సుజన, శివయ్య, రేణుక, మురళి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు శ్రీలేఖ, కిరణ్మయి పాల్గొన్నారు.

**పురుషులే అధికం**

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళల కంటే పురుషులే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి పురుషుల్లో మొత్తం 2,45,093 మందికి గాను 1,76,871 మంది ఓటు వేశారు. మహిళల్లో 1,34,686 మందికి గాను 91,514 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి 16,825 మంది పురుషులకు గాను 15,107 మంది, 10,869 మంది మహిళలకు గాను 9,634 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు వివరించారు.

**పట్టభద్రుల పోలింగ్ వివరాలు**

| జిల్లా | మొత్తం ఓటర్లు | ఓటు వేసిన వారు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| అన్నమయ్య | 23,838 | 16,850 | 70.69 |
| బాపట్ల | 26,390 | 19,655 | 74.48 |
| చిత్తూరు | 54,152 | 43,161 | 79.70 |
| నెల్లూరు | 1,07,635 | 68,559 | 83.38 |
| ప్రకాశం | 82,225 | 59,835 | 55.59 |
| తిరుపతి | 85,570 | 60,327 | 70.50 |
| మొత్తం | 3,79,810 | 2,68,387 | 70.66 |

**ఉపాధ్యాయుల పోలింగ్ వివరాలు**

| జిల్లా | మొత్తం ఓటర్లు | ఓటు వేసిన వారు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| అన్నమయ్య | 1,932 | 1,728 | 89.44 |
| బాపట్ల | 1,789 | 1,686 | 94.24 |
| చిత్తూరు | 3,887 | 3,448 | 88.71 |
| నెల్లూరు | 8,165 | 7,277 | 89.12 |
| ప్రకాశం | 5,789 | 5,322 | 91.93 |
| తిరుపతి | 6,132 | 5,280 | 86.11 |
| మొత్తం | 27,694 | 24,741 | 89.34 |

# ముత్యాలమ్మా.. మమ్మేలమ్మా!





జాతరకు ముస్తాబైన ముత్యాలమ్మ ఆలయం(ఇన్‌సెట్) బంగారు చీరలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ

- అట్టహాసంగా ఆరంభమైన పోలేరమ్మ జాతర

**చిల్లకూరు:** ముత్యాలమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ఆరంభమైంది. తీరప్రాంతమైన తూర్పుకనుపూరులోని ఇసుక భూముల్లో గంగమిట్ట మీద పోలేరమ్మను తాత్కాలికంగా వేసిన పూరిగుడిసెలో నిలుపుదల చేశారు. ఆదివారం ప్రారంభమైన ఘటోత్సవం కొమరావారిపాళెం, ఈదలవారిపాళెం, రావులవారిపాళెం మీదుగా తూర్పుకనుపూరుకు మంగళవారం రాత్రి చేరుకుంది. కుమ్మరి ఇంట్లో అమ్మవారి మట్టి ప్రతిమను తయారుచేసి చాకలి ఇంటికి తరలించారు. అక్కడ ఘటం కుండలు దించుకున్న తర్వాత అమ్మవారికి దిష్టి చుక్క పెట్టి గణాచారి అనుమతితో అమ్మణ్ణిని చప్పరం (పల్లకీ)పై ఉంచి ఊరేగిస్తూ తీసుకువచ్చి గంగమిట్టమీద ప్రతిష్ఠించారు. తొలి రోజు ముత్యాలమ్మకు బంగారు చీరను అలంకరించారు. మూలవిరాట్‌కు ఉదయం అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు.

**పక్కాగా ఏర్పాట్లు**

నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ జాతరకు దేవదాయశాఖతోపాటు ఆలయ పాలక మండలి సభ్యులు, పోలీసులు పక్కా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ భారీ బందో బస్తు ఏర్పాటు చేసింది. గూడూరు సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో రూరల్ సీఐ దశరథరామారావు, ఎస్‌ఐ గోపాల్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమ్మవారి ఆలయం ఎదుట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

# గంగరంగ సంబరం

- వైభవంగా సుగుటూరు గంగమ్మ జాతర
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి దంపతులు
- నేటి రాత్రి ఊరేగింపు.. నిమజ్జనం



గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, స్వర్ణమ్మ దంపతులు



అన్నదానం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**పుంగనూరు :** పట్టణంలో సుగుటూరు గంగమ్మ జాతర తొలిరోజు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ముందుగా ప్యాలెస్‌లో అమ్మవారికి జమీందారులు మల్లికార్జున రాయల్, సోమశేఖర్ చిక్కరాయల్ , కుటుంబ సభ్యులు తొలి పూజలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సతీమణి స్వర్ణమ్మతో కలసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జమీందారులను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వర్తక వ్యాపారుల సంఘ అధ్యక్షుడు వెంకటాచలపతి శెట్టి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. రాత్రి పట్టణంలో అమ్మవారికి ఊరేగింపు నిర్వహించి, బుధవారం వేకువజామున ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో కొలువుదీరుస్తారు. అదే రోజు రాత్రి ఊరేగించి నిమజ్జనం చేస్తారు. పూజా కార్యక్రమాలలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

**ఘనంగా ఊరేగింపు**

సుగుటూరు గంగమ్మను అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**భారీ బందోబస్తు**

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డి, అశోక్‌కుమార్ పర్యవేక్షణలో 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### నగలు భద్రం



ఆభరణాల లెక్కలు సరిచూస్తున్న అధికారులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు ఆభరణాలను మంగళవారం అధికారులు లాకర్‌కు తరలించారు. గత నెల 13న మహాశివరాత్రిని పురస్కరించుకుని లాకర్ నుంచి తీసుకువచ్చి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు అలంకరించి ఊరేగించారు. బ్రహ్మోత్సవాలు ముగియడంతో తిరిగి నగలను లాకర్‌లో భద్రపరిచారు.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 141 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 98,010 మంది విద్యార్థులు
- ఆన్‌లైన్లో హాల్‌టికెట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి (ఫైల్)

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్‌తో కలిపి 53,871 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్‌తో కలిపి 44,139 మంది 98,010 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘా, లైవ్ స్ట్రీమింగ్‌తో నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్‌ఐఓ) రమేష్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 12 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అలాగే సెల్ఫ్ కేంద్రాలైన నందనం, పాలసముద్రం, ఐరాల, పాపానాయుడుపేట కేంద్రాల్లో స్క్వాడ్లు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. డీఈసీ, హైపవర్ కమిటీ సభ్యులు, ఆర్‌ఐఓ, డీఐఈఓ, ఐదు ఫ్లయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తుంటాయన్నారు. వీరితో పాటు బోర్డు నుంచి ప్రత్యేక బృందం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తుందని పేర్కొన్నారు.

**ఆన్‌లైన్లో హాల్‌టికెట్లు**

గత అనుభవాల దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ 'బీఐఈ.ఏపీ.జీఓవీ.ఇన్'లో ఉంచింది. ఈ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిపై సంబంధిత కళాశాల సంతకాలు, స్టాంపులు అవసరం లేదు. హాజరు శాతం 75కు మించి ఉంటే అపరాధ రుసుము లేకుండా డౌన్‌లోడ్ చేసుకోచ్చు. 10రోజులు తక్కువ ఉంటే రూ.1,000, 11 నుంచి 15 రోజులు తక్కువ ఉంటే రూ.1,500, 15 రోజుల నుంచి 60 శాతంపైన హాజరుంటే రూ.2 వేలు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. సైన్స్ విద్యార్థులకు 60 శాతం కంటే తక్కువ హాజరుంటే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాదు. 75 శాతం హాజరుండి విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐఓ హెచ్చరించారు. ఏవైనా ఇబ్బందులుంటే నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు .

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, సమస్యలను తెలిపేందుకు తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఆర్‌ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. ఫిర్యాదులు, సమస్యలపై 86885 95909, 88854 19096 నంబర్లలో సంప్రదించవచ్చు.

**నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు**

ఇంటర్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఆర్‌ఐఓ చెప్పారు. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలను ఒకట్రెండు రోజుల ముందే చూసుకోవాలని, పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికి అరగంట ముందే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల రూట్లలో అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### ఆల్ ది బెస్ట్

**తిరుపతి అర్బన్:** 'ఆల్‌ది బెస్ట్.. అందరూ పరీక్షలు బాగారాయాలి'అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## క్లుప్తంగా

### టీడీపీ నాయకులపై కేసు నమోదు

ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లపై దాడి చేసి గాయపరచిన ఘటనలో టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. ఏర్పేడు ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ సునీల్‌కుమార్ నీళ్లు తాగేందుకు గది నుంచి వెలుపలికి రాగా.. అదే సమయంలో అక్కడ ఉన్న టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, చెంచయ్య నాయుడు, నాగరాజు నాయుడు, నాగభూషణనాయుడు, బాబునాయుడు, ధనుంజయులు నాయుడు, గురునాథం, శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు అతనిపై దాడిచేసి కులం పేరుతో దూషించారని చెప్పారు. మరో ఏజెంట్ దామోదరరెడ్డి అడ్డుకోగా.. టీడీపీ నాయకులు అతనిపై మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

### ఐదు ద్విచక్ర వాహనాల దహనం



కాలి బూడిదైన ద్విచక్ర వాహనాలు

తిరుపతి క్రైమ్: నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీలో గుర్తుతెలియని ఆకతాయిలు ఐదు ద్విచక్ర వాహనాలను దహనం చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ జయస్వాములు కథనం.. సంజయ్ గాంధీ కాలనీలోని బడిబార్ సమీపంలోని సందులో గుర్తుతెలియని వ్యక్తులు బాబుకు చెందిన ఐదు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. మంటలు పెద్దవి కావడంతో స్థానికులు గమనించి వెంటనే ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ద్విచక్రవాహనాలు కాలిబూడిదయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

### రీసర్వేను వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: భూముల రీసర్వే రెండో విడత గ్రౌండ్ ట్రూతింగ్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సర్వేపై కలెక్టరేట్‌లో జేసీ బాలాజీతో కలిసి అధికారులతో సమీక్షించారు. రెండవ దశ రీసర్వేలో జిల్లాలోని 208 గ్రామాలకు గాను 140 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మిగిలిన గ్రామాల్లో మార్చి 31 నాటికి పూర్తి చేయాలని సర్వే జిల్లా అధికారి జయరాజ్‌ను ఆదేశించారు.

### పార్టీ సిద్ధాంతాలపై పట్టుండాలి

తిరుపతి కల్చరల్: పార్టీ సిద్ధాంతాలపై కార్యకర్తలకు పట్టు ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లవసేన్ గుప్తా సూచించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు తలపెట్టిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

# బోగస్ కలకలం

- అడ్డదారుల్లో స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు
- ఇప్పటికే ఎనిమిది మందివి నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ



వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం 2022 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి (జోన్–4)లో దాదాపు 12 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయలసీమ వ్యాప్తంగా అభ్యర్థులు ఉన్నారు. 2023 జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 291 మందికి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ ఉద్యోగాలు పొందడానికి ఇంటర్మీడియెట్ తర్వాత నాలుగేళ్ల స్టాఫ్ నర్సు కోర్సు చేయాలి. బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తిచేయాలి. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సుకు గుర్తింపు ఉంటుంది. కాగా స్టాఫ్ నర్సు నియామకాల్లో మార్కుల జాబితానే కీలకపాత్ర పోషిస్తుంది. ఎవరికైతే అత్యధికంగా మార్కులు ఉంటాయో వారినే ఉద్యోగం వరిస్తుంది. ఈ అంశాన్ని గమనించిన కొంతమంది ఏకంగా మార్కుల బోగస్ జాబితాను సృష్టించి ఉద్యోగాలు పొందారు.

కొంత మంది అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడానికి బరితెగిస్తున్నారు. వారికి కొందరు సహకరిస్తున్నారు. దీంతో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది. ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పలువురు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. తాజాగా బోగస్ మార్కుల జాబితాల కుంభకోణం వెలుగుచూడడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అలజడి నెలకొంది.

**అనుమానించి తీగలాగడంతో..**

ఈ వ్యవహారమంతా దాదాపు చిత్తూరు జిల్లా కేంద్రంగా జరగడం చర్చనీయాంశంగా మారింది. ఆ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కుమార్తెకు స్టాఫ్ నర్సు ఉద్యోగం రాలేదు. తన కుమార్తెకు మార్కులపరంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అనుమానించారు. దాదాపు 15 మందిపై దృష్టి సారించారు. వారిపై కడపలోని వైద్యఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్‌తోపాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ఫిర్యాదు చేశారు. అందులో కొన్ని బోగస్ మార్కుల జాబితాలు ఉన్నట్లుగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. దీంతో అనుమానం నిజమైంది. కాగా వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చేముందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌లో కూడా ఆ శాఖ అధికారులు నకిలీ మార్కుల జాబితాలను కనిపెట్టలేకపోయారు. తాజాగా ఈ అంశం ఆ శాఖలో కలకలం రేపుతోంది. ఈ 15 మందేనా? లేక ఇంకా ఎవరైనా ఉద్యోగాలు పొందిన బోగస్ అభ్యర్థులు ఉన్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**వారు వీరేనా?**

కోవిడ్ సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విరివిగా స్టాఫ్ నర్సుల నియామకాలను చేపట్టారు. ఈ సందర్భంగా కొంత మంది వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు అభ్యర్థులకు తక్కువ మార్కులు ఉన్నా ఎక్కువ ఉన్నట్లుగా సృష్టించి కాంట్రాక్టు నర్సులుగా ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అప్పట్లో ఈ అంశం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. అలా నాడు బోగస్ మార్కుల జాబితాను పొందిన వారిలో కొంతమంది తాజాగా వెలుగు చూసిన స్టాఫ్ నర్సు నియామకాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు వినికిడి

**చట్టపరమైన చర్యలు**

“15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లుగా తమ దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపాము. 15 మందిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్‌వని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు స్పష్టం చేశారు. ఆ ఎనిమిది మందిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. మిగతా వారి సర్టిఫికెట్ల వివరాలు అందాల్సి ఉంది. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీచేశాం. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

**ఇంటిదొంగల పనేనా?**

తాజాగా అలజడి రేపుతున్న బోగస్ మార్కుల జాబితా అంశం ఇంటి దొంగల పనా? లేక బయటి వ్యక్తుల పనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లోతుగా విచారణ చేస్తే మరి కొత మంది బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు బయటపడతారని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు భావిస్తున్నారు.

### వలంటీర్‌పై టీడీపీ నాయకుడి దాడి



గాయపడ్డ భరత్‌కుమార్

ఏర్పేడు: పాతకక్షల కారణంగా గ్రామ వలంటీర్‌పై టీడీపీ నాయకులు దాడిచేసిన ఘటన ఏర్పేడు మండలం, చెల్లూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. చెల్లూరు గ్రామానికి చెందిన భరత్‌కుమార్ అలియాస్ బద్రిగౌడ్ స్థానిక సచివాలయ పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన తమ్ముడు పృథ్వీ గ్రామంలోని ఓ ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా టీడీపీకి చెందిన రాయలచెరువు లక్ష్మయ్య గొడవపడ్డాడు. అనంతరం అక్కడకు చేరుకున్న భరత్ కుమార్‌పై పాతకక్షల కారణంగా రాయలచెరువు లక్ష్మయ్య, భార్య కన్నెమ్మ, కుటుంబ సభ్యులు కవిత, యామిని మూకుమ్మడిగా దాడిచేశారు. తలపై రాయితో కొట్టి గాయపరిచారు. గాయపడ్డ భరత్ కుమార్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. భరత్‌కుమార్ తమ్ముడు పృథ్వి ఏర్పేడు సీఐ శ్రీహరికి ఫిర్యాదు చేశాడు.

## యూనిఫామ్డ్ సర్వీస్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్డ్ సర్వీస్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.శార సరోజినీ తెలిపారు. 6 నెలల కాల పరిమితితో కూడిన పీజీ డిప్లొమో ఫర్ ఎంట్రీ ఇన్ టూ యూనిఫామ్డ్ సర్వీసెస్ (సబ్ ఇన్‌స్పెక్టర్), డిప్లొమో ఫర్ ఎంట్రీ ఇన్ టూ యూనిఫామ్డ్ సర్వీసెస్ (కానిస్టేబుల్ క్యాడర్), డిప్లొమో ఫర్ ఎంట్రీ ఇన్ టూ డిఫెన్స్ సర్వీసెస్ (మిలిటరీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొదటి కోర్సుకు డిగ్రీ, రెండో కోర్సుకు ఇంటర్, మూడవ కోర్సుకు టెన్త్ అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనానంతరం ఏప్రిల్ 1న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల వర్సిటీ వెబ్‌సైట్ అయిన ×డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్పీఎంవీవీ.ఏసీ.ఇన్×లో ఉన్నాయని, మరిన్ని వివరాలకు 80963 89573, 90003 60743 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రామ్మూర్తి మృతదేహం

చంద్రగిరి: ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకోవడానికి రోడ్డు దాటుతున్న క్రమంలో కోళ్ల లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాకాల మండలం, మణిపిరెడ్డిపల్లికి చెందిన రామ్మూర్తి(56), హరి వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మంగళవారం తిరుపతికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనంలో పెట్రోల్ కొట్టించుకోవడానికి ఐతేపల్లి వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కోళ్ల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందగా, హరి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హరిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. తర్వాత రామ్మూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో విజయకేతనం



క్రీడాకారులతో యూనివర్సిటీ అధికారులు

చంద్రగిరి: సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో శ్రీవిద్యానికేతన్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఎంబీయూ యూనివర్సిటీ వీసీ ఆచార్య నాగరాజరామారావు తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి క్రీడా మైదానంలో నిర్వహించిన సౌత్‌జోన్ క్రీడా పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్టు తెలిపారు. లాంగ్ జంప్, హైజంప్, రన్నింగ్, షాట్‌పుట్ వంటి పోటీలలో ప్రణీత, త్రిశూల్‌తేజ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, డీవీఎస్ఎన్ రాయల్, హరినారాయణరెడ్డి పతకాలు సాధించినట్టు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం కళాశాలకు విచ్చేసిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాపతి, పీడీ సుమన్ పాల్గొన్నారు.


## బురదజల్లడానికే టీడీపీ దొంగనాటకాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై బురదజల్లడానికే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్ దొంగనాటకమాడారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈమేరకు మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డి దొంగనాటకమాడి అడ్డంగా దొరికిపోయారన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై ఫ్యాక్షనిస్టు ముద్ర వేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ ఆప్కో డైరెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ మిద్దె లహరి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలకు డీజిల్ ఇంజిన్ వితరణ



వితరణ ఇచ్చిన డీజిల్ ఇంజిన్

సత్యవేడు: శ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక చర్యల్లో భాగంగా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగానికి రూ.4 లక్షలు విలువచేసే ఆధునాతన 4-స్ట్రోక్ బిఎస్–6 డీజిల్ ఇంజిన్‌ను ఇతరణగా ఇచ్చింది. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశ కార్యక్రమంలో ఇసుజు ఇంజినీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్ మాట్లాడుతూ ఉత్తమ ఇంజినీర్లను తీర్చిదిద్దడం తమ బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు. ఇసుజు–ఈఎంఐ డిప్యూటీ జనర్ మేనేజర్(హెచ్ఆర్) కెనడీ, రాష్ట్ర సంకేతికి విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ సమక్షంలో కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషాదేవిక డాక్యుమెంట్‌ను అందజేశారు. ప్రత్యేక సమావేశంలో హెచ్ ఆర్.కెనడీ మాట్లాడుతూ కళాశాలలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఈ తరహా వితరణలతో పాటు విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ కల్పనకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇసుజు ఫ్యాక్టరీ మేనేజర్ గోపాల్ కృష్ణన్ ఇంజిన్ ఉపయోగాలు, వినియోగించే విధానం తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్జేడీ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



సి.లూహిత, 7వ తరగతి విద్యార్థిని

పిచ్చాటూరు: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు వెంగళత్తూరు శ్రీ సాయిరాం హైస్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గిరిబాబు, గంగయ్య తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ఎంపిక ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ ఎంపికలో వెంగళత్తూరులోని ప్రయివేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సి.లూహిత చేసిన ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. ఈ మేరకు లూహిత ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. ఈనెల 21, 22 తేదీలలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఆన్‌లైన్ ఇన్‌స్పైర్ పోటీలలో లూహిత తన ప్రాజెక్టుతో పాల్గొననున్నట్లు వారు వెల్లడించింది.

### మహిళా వర్సిటీలో విద్యుత్సవ్-2కే 23



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళా వర్సిటీ ప్రొఫెసర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: మహిళా వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 31, ఏప్రిల్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు విద్యుత్సవ్–2కే23 పేరుతో జాతీయ స్థాయి సాంకేతిక్ ఉత్సవ్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆ వర్సిటీలో ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వీసీ.వీరారెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డీ.నర్మిత, కన్వీనర్ ఎం.పల్లవి, కో–కన్వీనర్ కే.షాలిని, స్టూడెంట్ కన్వీనర్ బీ.ప్రీతి, కో–కన్వీనర్ ఎస్.సుష్మ తదితరులు ఆవిష్కరించారు.

### బాలికల సైనిక్ స్కూల్‌కు విశ్వం విద్యార్థినులు



డి.దేవాన్ని డి.వినతి చౌదరి కె.మాన్వికరెడ్డి ఎస్.వర్షిణి

తిరుపతి ఎడ్యుకేషన్: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల విద్యార్థినులు నలుగురు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో డీ.దేవాన్ని, డీ.వినతి చౌదరి, కే.మాన్వికరెడ్డి, ఎస్.వర్షిణి కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందినట్లు తెలిపారు. తమ విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

### సైన్స్ హ్యాక్ 3.0 పోటీలకు దరఖాస్తు చేసుకోండి

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతిలో ప్రారంభించిన సైన్స్ హ్యాక్ 3.0 పోటీలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సైన్స్ ప్రయోగాలపై పోటీలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయోగాలకు సంబంధించిన వీడియోలను ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ఈ–సర్టిఫికేట్స్ అందజేస్తామని చెప్పారు.

### రేపటి నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మంగళవారం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థి, యువజన సంఘాల ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సురేంద్రనాథ్, అధ్యక్షురాలు వీఆర్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### పట్టువస్త్రాల సమర్పణ



భక్తవత్సల పెరుమాళ్‌కు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, తిరునిన్రవూరులోని శ్రీభక్తవత్సల పెరుమాళ్ ఆలయానికి మంగళవారం సాయంత్రం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద జీయర్‌స్వామివారు ఈ ఆలయానికి ఆధ్యాత్మికపెద్దగా వ్యవహరిస్తున్నారు. స్వామివారి కోరిక మేరకు 2010 నుంచి ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ శ్రీవారి కానుకగా పట్టువస్త్రాలు సమర్పిస్తోంది. ముందుగా తిరునిన్రవూరులోని పెద్ద జీయర్‌స్వామివారి మఠానికి ఈఓ చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని శ్రీ భక్తవత్సల పెరుమాళ్‌కు పట్టువస్త్రాలు సమర్పించారు.

### 17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఏపీ రీసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన పీహెచ్‌డీ సీట్లను ఈనెల 17న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి తెలిపారు. ఏపీ రీసెట్–2022లో అర్హత సాధించి, సంబంధిత పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని వర్సిటీ పాలకభవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలు www. jntua. ac. in వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు.

## డ్రై ఫ్లవర్ ఉత్పత్తులు అద్భుతం



అగరబత్తీల కేంద్రంలో బంగ్లాదేశ్ శాస్త్రవేత్తల బృందం

తిరుపతి రూరల్ : తిరుమల శ్రీవారి సేవలో ఉపయోగించిన డ్రైఫ్లవర్స్‌తో తయారు చేసిన ఉత్పత్తులు అద్భుతమని బంగ్లాదేశ్ వాణిజ్య విభాగం డిప్యూటీ కార్యదర్శి ఫిరోజ్ మమూన్ కొనియాడారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌కు చెందిన సొసైటీ ఫర్ బ్రైట్ సోషల్ సర్వీస్ సహకారంతో ప్రోసెసింగ్ అండ్ ప్రొడెక్ట్ ప్రిపరేషన్ ఇన్ కట్‌ఫ్లవర్ సెక్టార్ అనే అంశంపై తిరుపతిలో చీనీ, నిమ్మ పరిశోధన కేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. బంగ్లాదేశ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సాహెబ్ ఉద్దీన్, డాక్టర్ ఫర్జానా నస్రిన్‌ఖాన్, డాక్టర్ జమాలుద్దీన్ బృందం సభ్యులు రెండు రోజులపాటు చీనీ, నిమ్మ పరిశోధనా కేంద్రం, టీటీడీ గోశాలలో డ్రై ఫ్లవర్స్‌తో తయారు చేస్తున్న అగరబత్తీల కేంద్రాన్ని సందర్శించారు. దేవుడి సేవలో ఉపయోగించిన పూలు వృథా కాకుండా వాటిని డ్రై ఫ్లవర్ ఉత్పత్తులుగా, అగరబత్తీలుగా తయారు చేస్తున్న విధానాలను అధ్యయనం చేశారు. అందమైన చిత్ర పటాలుగా, సువాసనలు వెదజల్లే అగరబత్తీలుగా తీర్చిదిద్దడం అమోఘమన్నారు. ఈ టెక్నాలజీనిబ బంగ్లాదేశ్‌లోనూ అమలు చేసేందుకు అధ్యయనం చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో చీనీ, నిమ్మ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ నాగరాజు, ఉద్యాన వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కరుణశ్రీ, టీటీడీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.